క్లుప్తంగా

ముగిసిన సమ్మర్ క్యాంప్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని నిర్మల్ హృదయ్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక(జేవీవీ), ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, డాక్టర్ ప్రశాంతి హాజరై పిల్లలనుద్దేశించి మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం జేవీవీ రాష్ట్ర కార్యదర్శి అలవాల నాగేశ్వరావు గత వారం రోజులుగా చేసిన జన విజ్ఞాన వేదిక చేసే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జేవీవీ బాధ్యులు కె.రాములమ్మ, జిల్లా అధ్యక్షుడు టి.శివన్నారాయణ, ప్రధాన కార్యదర్శి కె.రామారావు, వీరనారాయణ, పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఖమ్మం వర్తక సంఘం వద్ద మంగళవారం బాటసారులకు ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, సెంట్రల్ ఈసీ సభ్యులు పాయల నాగేశ్వరరావు, కైలాసపు వేణుగోపాల్, నేరెళ్ల శేషగిరిరావుతో పాటు రంగా భాస్కర్‌రావు, చెరుకూరి సంతోష్‌కుమార్, పెనుగొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు



మృతదేహాల వద్ద శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మం వైద్యవిభాగం/ఖమ్మంక్రైం: రెండు అనాథ మృతదేహాలకు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అనాథలు మృతి చెందగా మృతదేహాలను మార్చురీలో భద్రపరిచారు. ఇప్పటివరకు ఎవరూ రాకపోవడంతో పోలీసుల ఇచ్చిన సమాచారంతో శ్రీనివాసరావు ఆధ్వర్యాన బల్లేపల్లిలోని వైకుంఠ ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై శ్రీకాంత్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

నేలకొండపల్లి: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ బృందం దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని చెరువుమాధారంలో మీ సేవ కేంద్రం వద్ద సదరం స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగులు వెళ్తే సైట్ ఓపెన్ కాక గంటల తరబడి వేచి చూడాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్లాట్ బుకింగ్ పక్రియను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎరదేశి నరసింహరావు, పాలకుర్తి బొడయ్య, తిరపయ్య, బ్రహ్మం, ఎస్.కె.మహమ్మద్, లక్ష్మయ్య, వీరబాబు, పెద్దపాక మల్లేశ్వరరావు, పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక



రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన లయ

రఘునాథపాలెం: ఖమ్మం పటేల్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో మండలంలోని కోటపాడుకు చెందిన చంద్రకాని లయ ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో సత్తా చాటిన ఆమెను రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 28 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్న లయను సర్పంచ్ బాతుల రమణసుధాకర్ తదితరులు అభినందించారు.

నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'క్యాచ్ ది రెయిన్'

ఖమ్మంస్పోర్ట్స్: నెహ్రూ యువ కేంద్రం, జాగృతి అసోసియేషన్ ప్రెసిడెంట్ షారుక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో మంగళవారం క్యాచ్ ది రెయిన్ కార్యక్రమంలో భాగంగా అర్బన్ మండలంలోని కేసీఆర్‌నగర్ కాలనీలో ఇంకుడుగుంతను నిర్మించారు. ప్రతి వర్షపు బొట్టును కాపాడుకుంటూ.. నీటిని ఒడిసిపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా లైబ్రరీలో యువతతో నీటి ప్రతిజ్ఞ చేయించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	విరూపాక్ష
సాయిరాం	ఫాస్ట్ ఎక్స్
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	అన్ని మంచి శకునములే
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మంగాంధీచౌక్

పారిశుద్ధ్యంపై పట్టింపేది?



రాజీవ్‌గృహకల్ప కాలనీలో సైడ్ కాల్వ దుస్థితి (ఇన్‌సెట్) కాల్వలో పారుతున్న మురుగు నీరు

పల్లెల్లో వీధులన్నీ మురుగుమయం

- కంపు కొడుతున్న కాలనీలు
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- కార్యదర్శులు విధుల్లో చేరినా.. అస్తవ్యస్తంగానే పనులు
- చోద్యం చూస్తున్న అధికారులు

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ.. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని స్వయానా కలెక్టర్ పల్లెప్రగతి సభల్లో ఆదేశించినా.. రూరల్ మండలంలోని పంచాయతీల సిబ్బందికి పట్టింపే లేదాయే. ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న అస్తవ్యస్త పారిశుద్ధ్య నిర్వహణే ఇందుకు నిదర్శనం. అయితే పంచాయతీ కార్యదర్శులు ఇటీవల విధులకు హాజరుకాకుండా సమ్మె చేపట్టగా.. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో సైడ్ డ్రెయిన్లలో మురుగునీరు చేరి కంపు కొడుతుండడంతో ప్రజలను నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరైనప్పటికీ నేటికి పారిశుద్ధ్యం అలాగే ఉంది.

ఖమ్మంరూరల్: మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో ఎక్కడ చూసినా పారిశుద్ధ్యం లోపించి వీధుల్లో చెత్త, సైడ్ కాల్వల్లో మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతీ రోజు దుర్వాసనతో నానా అవస్థలు పడుతున్నారు. ఇదేమిటని గ్రామస్తులు అడిగితే పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉందని, ఇదిగో అదిగో అంటూ చెప్పి నెలల తరబడి కాలయాపన చేయడమే తప్ప పనుల్లో పురోగతి లేదని మండల ప్రజలు వాపోతున్నారు.

నిధులు ఏమవుతున్నట్లు?

ఇదిలా ఉండగా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నెలానెలా పంచాయతీల జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తోంది. ఆ నిధులతో పనులు చేపట్టి గ్రామాలను సుందరంగా తీర్చి దిద్దాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుర్వాసనతో సహవాసం..

మండలంలోని గోళ్లపాడు, గుదిమళ్ల, రాజీవ్ గృహకల్పలలో గత నాలుగు నెలలుగా సైడ్ కాల్వల్లోని మురుగునీటిని తొలగించకపోవడంతో గ్రామస్తులు దుర్వాసనతో సహవాసం చేయాల్సి వస్తోంది. ఇలా మండల వ్యాప్తంగా ఉన్న దాదాపు ఒకటి అరా తప్ప ఎక్కువ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొనడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు. పాలకులు ఎన్ని రూ.కోట్ల నిధులు కేటాయించినా.. అభివృద్ధి శూన్యమేనని ఆయా గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మురుగునీరు చేరుతోంది..

గత నాలుగు నెలలుగా సైడ్ క్వాలల్లో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతూ బయటకు వెళ్లలేకపోతున్నాం. ఇళ్లల్లో వాడుకున్న నీరంతా కాల్వలోని చెత్తా చెదారంతో ఎక్కడికక్కడే నిలిచిపోయి దోమలతో దుర్గంధం వస్తోంది. ఉండలేకపోతున్నాం.

– కనకమ్మ, రాజీవ్ గృహకల్ప

ఎవరూ పట్టించుకోరు..



మా కాలనీలో వీధులన్నీ బురదమయమయ్యాయి. అంతకు ముందే సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించకపోవడంతో ఇళ్లలో వాడుకున్న నీరంతా మరింత చేరి దుర్వాసన వస్తోంది. మురుగునీటిని తొలగించాలని అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదు.

– హనుమంతు, గుదిమళ్ల

పనులు చేయిస్తున్నాం..

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. ప్రతీ గ్రామంలో సైడ్ కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడానికి పంచాయతీ సిబ్బందితో ఎప్పటికప్పుడు తీయిస్తున్నాం. తానే స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నా. కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ

నిధుల ఖర్చులో సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండడంతో పంచాయతీల్లో పాలన పడకేసిందనే ఆరోపణలున్నాయి.


వ్యాధుల బారిన ప్రజలు..

అంటువ్యాధులు, సీజనల్ వ్యాధుల క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెబుతున్న అధికారులు మరి ఆ శ్రద్ధ పంచాయతీల పరిశుభ్రతపై ఎందుకు లేదని గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాము వ్యక్తిగత పరిశుభ్రత పాటించినా తమ ఇంటి ముందు ఉన్న సైడ్ కాల్వల్లో నెలల తరబడి మురుగునీరు, చెత్తాచెదారం పేరుకుపోయి దోమలు చేరి దుర్వాసన వస్తోందని తద్వారా రోగాల పాలవుతున్నామని ప్రజలు చెబుతున్నారు.

అరకొర పనులతో అస్తవ్యస్తం..!

పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17 నుంచి 23 వరకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో రహదారుల వెంట చెత్తా చెదారం తొలగించడం, సైడ్ డ్రెయిన్లలో మురుగునీరు తొలగించి బ్లీచింగ్ చల్లడం, తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాలను చేపట్టాల్సి ఉంది. కాని అధికారులు అరకొరగా పనులు నిర్వహించి చేతులు దులుపుకోవడంతో ఇదిగో ఇలా పారిశుద్ధ్య పనులు దర్శనమిస్తున్నాయి. కాగా, ఎంపీడీఓ జయరాంను వివరణ కోరగా.. అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరుగుతున్నాయని తెలిపారు.

– తిరుమలాయపాలెం



చంద్రుతండాలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



సుబ్లేడులో కాల్వలో పేరుకుపోయిన మురుగు



మహ్మదాపురం శివారుతండాలో రోడ్డు పక్కన నిలిచిన మురుగు

రాజకీయాల్లో విలువలు, నిబద్ధత ఉండాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయాలు అంటే విలువలు, నిబద్ధత ఉండాలని.. జిల్లాలో అడ్రస్, జెండా ఎజెండా లేని కొంతమంది సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటే సహించబోమని, వారి స్థాయి తెలుసుకొని మాట్లాడాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.సీఎం కేసీఆర్ నాయకత్వంలో జిల్లాలో పదికి పది సీట్లు గెలుస్తామని స్పష్టం చేశారు. మువ్వా విజయబాబు బ్యాంక్ చైర్మన్‌గా ఉన్న సమయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి రైతుల డబ్బులతో ఏమి చేశారో, ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టులతో పాటు ప్రభుత్వ స్థలాలను 59 జీఓ ద్వారా పొందారని అన్నారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, షేక్ మక్బూల్, దండా జ్యోతిరెడ్డి, కూరాకుల వలరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్

అక్రమాలన్నీ త్వరలోనే బయటకు తీస్తాం..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో అభివృద్ధి పేరుతో మంత్రి పువ్వాడ చేసిన అక్రమాలను త్వరలోనే బయటకు తీస్తామని, పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం చూసి తట్టుకోలేక మంత్రి పువ్వాడ మాట్లాడుతున్నాడని మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయబాబు, మద్దినేని బేబి స్వర్ణకుమారి, కార్పొరేటర్ దొడ్డా నగేష్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్ల పాటు పొంగులేటి కాంట్రాక్టర్‌గా కష్టపడి ఇప్పుడు ఈ స్థాయికి వచ్చారని, 59 జీఓ ద్వారా ప్రభుత్వ భూమిని పువ్వాడ అజయ్‌కుమార్ కబ్జా చేశారన్నారు. వెలుగుమట్ల, రఘునాథపాలెం వద్ద బైరటీస్‌ను అక్రమంగా తవ్వి తరలిస్తున్నారన్నారు. డీసీసీబీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అన్నింటికి లెక్కలున్నాయని వెల్లడించారు. అక్రమాలపై అష్టలక్ష్మీ గుడి దగ్గర ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని, నీవు సిద్ధమా? అంటూ పువ్వాడకు మువ్వా సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో ప్రజాక్షేత్రంలో పువ్వాడ ఓటమి తప్పదన్నారు. కార్పొరేటర్ దొడ్డా నగేశ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఖమ్మంలో పువ్వాడపై గెలిచే బచ్చాను తానేనన్నారు. ఈ సమావేశంలో మందడపు తిరుమలరావు, బోడా శ్రావణ్, మియా భాయ్, దుంపల రవి కుమార్, మందడపు నాగేశ్వరరావు, దుర్గా, నాగరాజు యాదవ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మువ్వా విజయబాబు

అన్నదానం..



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన సభ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో వద్దిరాజు రవన్న యువసేన ఆధ్వర్యాన మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం బైపాస్ రోడ్డులోని అన్నం ఫౌండేషన్, పాత బస్టాండ్ వద్ద అన్నదానాలు చేశారు. తొలుత వృద్ధులు, అనాథల సమక్షాన కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అలాగే, పాత బస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్ల సమక్షంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్పొరేటర్ నాగుల్ మీరా, జర్నలిస్ట్ ఆకుతోట ఆదినారాయణతో పాటు నానబాల హరీష్, రాపర్తి రాజా, సుంకర చిరంజీవి, గొరిశెట్టి వినోద్, గోలెపు గణేష్, ఆకుల సాయి, బోయిన కార్తీక్, పత్తి శ్రీను, దోసపాటి కిరణ్, అరుణ్, మహేష్, సాయి పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం




ఏలువారిగూడెంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెంలో ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌లు మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరెగూడెం కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, సర్పంచ్ దొనకొండ రామకృష్ణ, వైద్యాధికారి రాధాకృష్ణ, పీహెచ్ఎన్ కె.వాణి, కార్యదర్శి కె.రామారావు పాల్గొనగా.. ఏలువారిగూడెంలో ఎంపీడీఓ జయరాం, ఎంపీఓ రాజేశ్వరి, ఏపీఓ నర్సింహారావు సర్పంచ్ దేవరం దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ పట్ల సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ మంగళవారం ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో పాటు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షినెట్‌వర్క్



ఖమ్మంరూరల్: సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్యదర్శులు



రఘునాథపాలెం: సీఎం, మంత్రి పువ్వాడ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు



నేలకొండపల్లిలో..



తిరుమలాయపాలెంలో..

ఆలయ భూముల రక్షణపై దృష్టి



సింగారెడ్డిపాలెంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న ఈఓ

నేలకొండపల్లి: మండలంలోని నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం, బోదులబండ, చెరువుమాధారం గ్రామాలకు చెందిన శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ భీమేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ రాజగోపాలస్వామి, శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయాలకు చెందిన భూములను మంగళవారం దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి పి.నారాయణచార్యులు సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయాలకు చెందిన భూముల్లో శాఖ తరఫున బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం బోర్డుల వద్ద అధికారులు, సిబ్బంది ఫొటోలు దిగి అప్‌లోడ్ చేశారు. అనంతరం ఈఓ నారాయణచార్యులు మాట్లాడుతూ.. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో దేవాలయాల భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ సిబ్బంది కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి రూ.600 ఇవ్వాలి



కూలీలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రఘునాథపాలెం: గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గణేశ్వరంలో ఉపాధి హామీ పనులను సందర్శించి కూలీలు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యలపై నినాదాలు ఇస్తూ పని ప్రదేశంలోనే ఆందోళన నిర్వహించారు. కూలీలకు 200 రోజుల పని దినాలతో పాటు పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మండల నాయకులు తిరపయ్య, వెంకన్న, బద్రునాయక్, శ్రీనివాసరావు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ గణేష్

ఖమ్మంక్రైం: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఖమ్మం టౌన్ ఏసీపీ పీవీ గణేష్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని పలు ఫెర్టిలైజర్ దుకాణ యజమానులు, డీలర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా డీలర్లు నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచుతూ.. విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు.నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు కొత్త వ్యక్తులు విక్రయించేందుకు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐలు సత్యనారాయణ, స్వామి, శ్రీహరి, ఫెర్టిలైజర్ దుకాణాల అధ్యక్షుడు నాగేందర్, మనోహర్ పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 41వ డివిజన్‌లో సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రూ.22 లక్షల అంచనాలతో చెరువుబజార్ హనుమాన్ టెంపుల్ నుంచి లకారం పెద్ద డ్రెయిన్ వరకు నిర్మాణం కానుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, డీఈ స్వరూపరాణి, ఏఈ నవ్యజ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, నాయకులు చిన్ని, నవీన్, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తేదారులతో సమావేశం..

కార్పొరేషన్ కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో మేయర్ నీరజను కాంట్రాక్టర్లు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ కాంట్రాక్టర్లతో సమీక్షించి తాము పూర్తి చేసిన పనులకు సంబంధించిన లావాదేవీలను ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పసుపులేటి వెంకటేశ్వరరావు, నాయకులు తమ్మిశెట్టి వెంకటనారాయణ, జూగల్ కిషోర్, బత్తుల తిరుమలరావు, ఎండీ బషీర్, శ్రీహరిరాజు, దండగల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మేయర్ నీరజ

నర్సరీల పరిశీలన



పువ్వాడనగర్‌లో మొక్కలను పరిశీలిస్తున్న డీపీఓ విజయనిర్మల

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడనగర్, బూడిదంపాడు గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల పరిశీలించారు. మంగళవారం నర్సరీలను సందర్శించి పలు మొక్కలను పరిశీలించాక మాట్లాడారు. హరితహారంలో భాగంగా రైతుల పొలాల గట్లపై టేకు మొక్కలు నాటేందుకు అవసరమైన మొక్కలు పెంచాలని తెలిపారు. ఏడీఏ సరిత, ఎంపీడీఓ ఆర్.రామకృష్ణ, ఏఓ ఐ.భాస్కరరావు, ఏపీఓ పద్మయ్య నాయుడు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు వరి సాగుపై అవగాహన

కూసుమంచి: రైతులు వరినాట్లను ముందస్తుగా వేసుకోవాలని ఏఓ వాణి సూచించారు. మంగళవారం కూసుమంచిలోని రైతు వేదికలో ముందస్తు వరి సాగు, వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించిన సందర్భంగా ఏఓ మాట్లాడారు. అకాల వర్షాలను అధిగమించేందుకు రైతులు వరిని జూన్ 25 వరకు నారు పోసుకొని సాగుచేసుకోవాలని, పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల భూసారం పెరుగుతుందన్నారు. జక్కేపల్లి, చేగొమ్మ సహకార సంఘాల్లో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు సబ్సిడీపై పొందొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రియాంక, రైతుబంధు కోఆర్డినేటర్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలి

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలను చేపడుతున్నారని గ్రామానికి చెందిన బుర్రా లింగరాజు అనే యువకుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కలెక్టర్ ఎంపీడీఓ కె.జమలారెడ్డిని విచారణకు ఆదేశించడంతో మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి చిరంజీవి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఆ స్థలంలో దివ్యాంగుడైన బుర్రా లింగరాజు కూరగాయల దుకాణం నిర్వహించుకుంటున్నారని, తమకు 58,59 జీఓ ప్రకారం స్థలాన్ని జీవనోపాధి కోసం కేటాయించాలని ఎంపీడీఓ, తహసీల్దార్‌లను కోరారు.